క్లుప్తంగా

సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపారు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్ మాదిగ

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని మాటల్లో కాకుండా ఆచరణలో చూపి అట్టడుగు వర్గాల హృదయాల్లో చెరగని స్థానం సాధించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్‌మాదిగ కొనియాడారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రకటించిన 18 ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అత్యధిక స్థానాలు కట్టబెట్టిన సీఎం చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. దళితులంటే రెండుకళ్లుగా భావించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం దళితులకు సముచిత స్థానం కల్పించి తన విశ్వసనీయత చాటుకున్నారన్నారు.

తాగునీటి శుద్ధికరణ కేంద్రాలు

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో బాల వికాస సాంఘిక సేవా సంస్థ వారి సారథ్యంలో ఉచితంగా తాగునీటి శుద్ధికరణ పథకం ఏర్పాటు చేయడానికి గ్రామ సభ నిర్వహించినట్లు బాలవికాస్ సొసైటీ ప్రతినిధి కటకం అబ్బులు మంగళవారం తెలిపారు. బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సౌజన్యంతో నియోజకవర్గంలో బొల్లాపల్లి, ఈపూరు, నూజెండ్ల, శావల్యాపురం, వినుకొండ ఐదు మండలాల పరిధిలో ఒక్కొ మండలంలో ఐదు గ్రామాలను ఎంపిక చేసి తాగునీటి శుద్ధికరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శావల్యాపురం మండలంలో మతుకుమల్లి, పోట్లూరు, కనమర్లపూడి ఎస్సీ కాలనీ, వేల్పూరు ఎస్సీ కాలనీ, ముండ్రువారిపాలెం గ్రామాలను ఎంపిక చేశామన్నారు.

ఖో-ఖో జట్టుకు శంకర భారతీపురం విద్యార్థిని



నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక బోరుగడ్డ సౌజన్య రాష్ట్ర స్థాయి ఖో-ఖో జట్టుకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు బీవీఎల్ వరప్రసాదు మంగళవారం వెల్లడించారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్టణంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి సౌజన్య హాజరై చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికై ందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయని జి.ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో...



శావల్యాపురం: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టీం తరుపున స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి విద్యార్థి ఆకుమళ్ళ సమీరా సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహించిన 41వ సబ్ జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి శావల్యాపురం హైస్కూలు విద్యార్థి ఆకుమళ్ళ సమీరా మంచి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఈసందర్భంగా జాతీయస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థి సమీరాను పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, సర్పంచ్ రాపూరి వెంకయమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, ఎంపీటీసీ పోతురాజు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్ సైదులు, ఎంఈవో మద్దికుంట సాంబశివ రావు, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, అబ్దుల్లా, శ్రీకాంత్, భువనేశ్వరి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, బాబు, కొణతం ఎరుకల రెడ్డి, చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, కొండారెడ్డి, మదార్, సత్యం ప్రత్యేకంగా అభినందించారు.

చకచకా టిడ్కో నిర్మాణ పనులు



ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న అధికారులు



తాగు నీటికోసం జరుగుతున్న పైపులైను పనులు



టిడ్కో గృహాల వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైయిన్లు

పేదవాడ్ని ఇంటివాడ్ని చేయడానికి జగనన్న ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. నాటి ప్రభుత్వం అర్థాంతరంగా ఆపివేసిన టిడ్కో భవనాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించి వాటిని నివాసయోగ్యంగా మారుస్తోంది. రహదారులు, నీటిసదుపాయం, డ్రైయిన్లు వంటి వాటిని గృహసముదాయాలలో ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెలలో పేదవాడి చేత గృహప్రవేశం చేయించాలన్న సంకల్పంతో నేతలు, యంత్రాంగం ముందుకు సాగుతున్నారు.

- వచ్చే నెలలో అందజేసేందుకు చర్యలు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట: గత టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించిన టిడ్కో గృహాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంత నిధులతో మౌలిక వసతులు కల్పించి వచ్చే మార్చి నెలలో లబ్ధిదార్లకు అందజేయబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) కింద పట్టణానికి 1504 గృహాలు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు మంజూరు చేసింది. వాటి నిర్మాణం చేపట్టిన అప్పటి ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడటంతో అసంపూర్తిగా నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు కేటాయించి పదవులు కోల్పోయి పలాయనం చేశారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజ్ లాంటి సౌకర్యాలు ఏమాత్రం లేకపోవటంతో లబ్ధిదారులెవరూ ఆ వైపునకు చూడలేకపోయారు... వెళ్లలేకపోయారు.

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే టిడ్కో గృహాలపై దృష్టిసారించారు. మిగిలిన ఇళ్లను పూర్తిచేసి కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రూ.6.61 కోట్ల నిధులను కేటాయించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి సాధ్యమైనంత త్వరగా మౌలిక వసతులు కల్పించి లబ్ధిదార్లకు అందజేయాలంటూ అధికారులను సమాయత్తం చేస్తూ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదార్ల ఎంపికలో కూడా టీడీపీ నాయకులు చేసిన అవకతవకలను గుర్తించి సరిచేశారు. సీసీరోడ్లు వేసి రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్లను నిర్మించారు. తాగునీటి అవసరాలకోసం 300కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. నీటి వసతి కల్పించేందుకు పట్టణ పరిధి నుంచి కేసానుపల్లి రోడ్డులోని టిడ్కో గృహాల వరకు పైపులైను నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారులు రాకపోకలు సాగించేందుకు చిలకలూరిపేట మెయిన్‌రోడ్డు నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని టిడ్కో గృహాల వరకు ప్రధాన రోడ్డును వేస్తున్నారు. మధ్యలో నూతన చప్టా నిర్మాణం చేస్తున్నారు.

బ్యాంకు రుణాలు ఆలస్యం

పేదలకోసం రూ.7.50 లక్షల విలువైన ఒక్కో ఇల్లు 365 అడుగుల కై వారంతో నిర్మించారు. దీనిలో లబ్ధిదారుడు తన వాటాగా రూ.50 వేలు చెల్లించగా బ్యాంకు నుంచి రూ.3.15 లక్షలు రుణం మంజూరు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు ఇచ్చింది. మిగతాది రాష్ట్రప్రభుత్వం భరిస్తోంది. ఎంపిక చేసిన 1504 మంది లబ్ధిదార్లలో 843 మందికి మాత్రమే ఇప్పటి వరకు పలు జాతీయ బ్యాంకులు రూ.26.64 కోట్ల రుణం మంజూరు చేశాయి. మిగతా లబ్ధిదార్లు వయస్సు 60 ఏళ్లకుపైగా ఉండటం, సరైన హామీ పత్రాలు బ్యాంకులకు చూపించకపోవటంతో రుణం మంజూరు ఆలస్యమౌతోంది.

మార్చిలో పూర్తిచేసి అందజేస్తాం

వచ్చే మార్చి నాటికి మౌలిక సదుపాయాలు పూర్తిచేస్తాం. పనులను యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. తాగునీటి పైపులైను నిర్మాణానికి మధ్యలో రైల్వేలైను అడ్డు వచ్చింది. రైల్వేశాఖ అనుమతి ఇవ్వగానే ఆ భాగంలో కూడా లైను పూర్తిచేస్తాం. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తిచేశాం.

– సుమలత, టిడ్కో ఏఈ

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

డీఎల్‌పీవో సీహెచ్. జయకృష్ణ



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సీహెచ్ జయకృష్ణ

ఈపూరు: మండలంలోని ఇంటి పన్ను వసూళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సీహెచ్. జయకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు నెలవారి టార్గెట్ నిర్ణయించుకొని 2023 ఫిబ్రవరి నాటికి నూరు శాతం వసూళ్లు చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్ వద్ద ఆహ్లాద వాతావరణం ఏర్పాటు చేయుట, వాటి పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మొక్కలు పెంచాలన్నారు. వర్మి కంపోస్టు ఎరువు తయారు చేయాలని, షెడ్స్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలని, పగటి పూట వీధిలైట్లు వెలగకుండా స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈనెల చివరిలో మిషన్ అంత్యోదయ సర్వే రిపోర్టు పూర్తి కావాలని చెప్పా రు. ప్రతి రోజూ క్లాప్ మిత్ర అటెండెన్స్, షెడ్ మిత్ర అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషాకిరణ్, సిబ్బంది ఉన్నారు.

■ స్పెషల్ డ్రైవ్



గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైల్వే స్టేషన్‌లలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రైల్వే స్టేషన్‌లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల బ్యాగ్‌లను పరిశీలించారు. ఇకపై తరచూ తనిఖీలు చేపడతామని రైల్వే ఎస్ఐ టి.సుబ్బారావు వెల్లడించారు. దాడుల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

– నరసరావుపేట టౌన్

108 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

90 అంశాలు ఏకగ్రీవం



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ (నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 109 అంశాలతో కూడిన అజెండాను సభలో ప్రవేశపెట్టారు. ఇందులో 18 అంశాలపై సభలో చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు. సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్, ఆధునీకరణ పనులు, అభివృద్ధి పనులకు సంబంధించిన 90 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అజెండాలో మొదటి అంశమైన 8వ వార్డులోని పైపు లైన్ పనులకు సంబంధించి గతంలో జరిగిన పనులనే మరలా చేర్చారని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అజెండాలో నుంచి ఆ అంశాన్ని తొలగించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డుల్లోని పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరిస్తామని చైర్మన్ హామీతో సమావేశం ముగిసింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్‌ఖన్నా, బేతం గాబ్రియేలు, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు



మాతృభాష విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం గురులింగం, ఉపాధ్యాయులు

చిలకలూరిపేటటౌన్: మాతృభాషను గౌరవించటం, ఆ భాషాభివృద్ధికి కృషి చేయటం ప్రతి ఒక్కరి విధి అని మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. మంగళవారం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మాతృ భాషాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ పరీక్షల్లో సైతం తెలుగు భాషలో రాసే అవకాశం ఉందన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు మాతృభాష విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దాసరి చిట్టిబాబు, గేరా యోకోబు, బుల్లిబాబు, బెజ్జం రవి, దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

నాదెండ్ల: ప్రతి చిన్నారి తన మాతృభాషలోనే సమాజాన్ని పరిచయం చేసుకుంటాడని, తల్లిలాంటి మాతృభాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని హెచ్‌ఎం ఎ.గురులింగం చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, అవనిగడ్డ హుస్సేనమ్మ యల్లమందయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 23వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెలొలికే తెలుగు దేశభాషల్లోనే విశిష్టమైనదని పేర్కొన్నారు. మాతృభాషను మరువకుండా మరో భాషను నేర్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరి, శివకుమారి, మేరిసుజాత, ఝాన్సీలక్ష్మీ, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు బాలకోటిరెడ్డి మృతి




రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామంలో ఈనెల ఒకటో తేదీ రాత్రి తుపాకి కాల్పుల్లో గాయపడ్డ టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్‌బాబు మంగళవారం రాత్రి వెల్లడించారు. గ్రామ టీడీపీలోని ఆధిపత్య పోరులో భాగంగా సమీప బంధువు వెంకటేశ్వరరెడ్డి అతడిపై కాల్పులు జరిపారని, అతడికి వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి అనే పాత నేరస్తులు సహాయపడ్డారన్నారు. కాల్పులు జరిగినప్పటి నుంచి గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి నిందితులను 24 గంటల వ్యవధిలోనే అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించటం జరిగిందన్నారు. కాగా, గతంలో బాలకోటిరెడ్డి మండల ఎంపీపీగా కూడా పనిచేశారు.

సానుకూల దృక్పథాన్ని అలవరచుకోండి

చిలకలూరిపేట: విద్యార్థులు సానుకూల దృక్పథం కలిగి ఉండటంతో పాటు ఆందోళనకు దూరంగా ఉండాలని సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు చెప్పారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు విద్యా-ప్రేరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో మాత్రమే పేదరికాన్ని రూపుమాపవచ్చని వెల్లడించారు.

సమన్వయంతో రీసర్వే పూర్తి చేయాలి

- జేసీ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశం
- యడ్లపాడు రెవెన్యూ కార్యాలయంలో ఆకస్మిక పరిశీలన
- సర్వే బృందాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ



యడ్లపాడులో రీసర్వే వివరాలపై సమీక్షిస్తున్న జేసీ ఎ.శ్యాంప్రసాద్

యడ్లపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో రీసర్వేను వేగంగా పూర్తి చేయాలని జేసీ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని జేసీ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష సర్వే పనులకు సంబంధించిన వివరాలపై సమీక్ష నిర్వహించారు. రీసర్వేలో భాగంగా మండల, గ్రామ సర్వేయర్ల నుంచి భూముల హద్దు రాళ్ల పాతుట క్షేత్రస్థాయి ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అలాగే దశల వారీగా రీసర్వే అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు వ్యవహారాన్ని కార్యాలయంలోని కంప్యూటర్లలో తనిఖీ చేశారు. గ్రామాల్లో రీసర్వే చేస్తున్న క్రమంలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. రైతు లు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వరమే పరిష్కారించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

రీసర్వేను మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అనంతరం రీసర్వే కార్యక్రమంలో పాల్గొంటున్న గ్రామస్థాయి సర్వేయర్లకు ఫస్ట్ ఎయిడ్, మరో 12 రకాల వస్తువులు కలిగిన కిట్లను జేసీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్వే విభాగ డీఐ పార్థసారథి, తహసీల్దార్ ఎస్. నాగమల్లేశ్వరరావు, మండల సర్వేయరు రాంబాబు, వీఆర్‌వోలు, సిబ్బంది ఉన్నారు.

రీసర్వే పనులు ఒడిదుడుకులు లేకుండా చేయాలి

నాదెండ్ల: రీసర్వే పనులు ఎలాంటి ఒడిదుడుగులు లేకుండా చేయాలని పల్నాడు జిల్లా జేసీ ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. జగనన్న భూరక్ష-భూహక్కులో భాగంగా రీసర్వేపై ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. మొదటి విడతలో చిరుమామిళ్ల, చందవరం, సంక్రాంతిపాడు, కనపర్రు గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యాయని రెండోవిడతలో ఎంపికైన ఐదు గ్రామాల్లో గొరిజవోలు గ్రామంలో ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. గ్రామం పరిధిలో 3160 ఎకరాలు పంట పొలాలు ఉన్నాయని ఇప్పటి వరకు పట్టాభూములు, ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందన్నారు.

పూర్తి చేసిన పనులను ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నారని తెలిపారు. మిగిలిన 30 శాతం పనుల్ని మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీఐ ఎం.పార్థసారధి, తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ అనురాధ, మండల సర్వేయరు అబ్బూరి శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు వేల్పూరులో గడపగడపకు మన ప్రభుత్వం

శావల్యాపురం: నేడు మండలంలోని వేల్పూరు గ్రామంలో గడప-గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొంటారన్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

రొంపిచర్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గల హైవే రోడ్డుపై మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. హైవే రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలంటూ రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నరసరావుపేట ఏరియా సహాయ కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ మండల కేంద్రమైన రొంపిచర్లలో గల హైవే రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారని అన్నారు.. ఇక్కడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజిరెడ్డి, మండల నాయకులు చక్రవరం సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, పిడెం హుస్సేన్, వ్యవసాయకార్మిక సంఘం మండల నాయకులు జమ్ములమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

శావల్యాపురం: నేడు మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ.4 కోట్లు వ్యయంతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్ కేంద్రాలతో పాటు గ్రామంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వినుకొండ ఆర్టీసీకి రూ.22 లక్షల ఆదాయం

వినుకొండ (నూజెండ్ల): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వినుకొండ డిపో పరిధిలో కోటప్పకొండ, శ్రీశైలం, త్రిపురాంతకం, మన్నెపల్లి, తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా 60 బస్సు సర్వీసులను నడిపినట్లు ఇన్‌చార్జ్ ఆర్టీసీ డీఎం ముదగిరి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇందుకుగాను ఆర్టీసీ ఆదాయం రూ. 22 లక్షల వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈసారి ఆదాయం రూ. 2 లక్షలు గణనీయంగా పెరిగినట్లు చెప్పారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడిగా పిడతల

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మాలమహానాడు నియోజకవర్గ కార్యాలయంలో వినుకొండ మండల మాలమహానాడు అధ్యక్షుడిగా పిడతల అనిల్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోదా జాన్‌పాల్ నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. జాన్‌పాల్ మాట్లాడుతూ మండలంలోని మాలల ఐక్యత, వారి అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు కొండ్రు విజయ్, వినుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు కొమ్మతోటి కృపయ్య, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్, శావల్యాపురం మండల అధ్యక్షులు మాలపోలు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి వెంకట్రావు డయాలసిస్ చేయించుకోవడానికి ప్రతివారం చిలకలూరిపేటకు వస్తాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటకు వచ్చి డయాలసిస్ చేయించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో మద్దిరాల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వెంకట్రావు కుమారుడు మారుతీ వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.